# ఆడవాళ్లా – అందాల పోటీలు

"మిస్ బబితా శేషాద్రి! అందాల పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి నందుకున్న యువతి, మిస్ ఆంధ్రప్రదేశ్" గట్టిగా పేపర్ చదువుతోంది సాహితి, ముఖ్యంగా ఈ వార్త సంగీతకి తెలియాలని. అది విన్న సంగీత దీనికి బహుమతి ఇచ్చిన ఆ జడ్జులు ఎంత అందమైన వాళ్లో, వాళ్ల అభిరుచి ఏమిటో అర్థమైపోతోంది! మొద్దుగా లావుగా వుండే పెదిమలు, చిన్నమూతి, అసలు నుదురు వుందో లేదోననిపించే చిన్న తలకాయ, దాన్లో ఏం వుందని ఈ బహుమానాన్నిచ్చారో తెలీదు. రంగు కూడా లేదు ఛామన ఛాయే! మైగాడ్" అంది సంగీత!

"అక్కా! నీకు చామంతులు ఇష్టమా? గులాబీలిష్టమా? బొండు మల్లెలిష్టమా? ముద్ద మందారాలిష్టమా? విచ్చుకున్న నంది వర్ధనాలిష్టమా? గన్నేరు లిష్టమా?" అడిగింది సాహితి.

"ఏమిటా పిచ్చి ప్రశ్న! దేని అందం దానిది. పసుపు రంగులో, తెలుపు రంగులో, ఊదా రంగులో మనస్సుని రంజింపజేస్తూ అందంగా గుండ్రని బిళ్లల్లా సన్నని రేకులు గుంపులుగా అచ్చు గుద్దినట్టుండే చామంతి అందం చామంతిది! అనేక రంగుల్లో ప్రేమికుల హృదయాలను సయితం కదిలించి వారి అనురాగానికి ఆనవాలుగా మమతల కొవెలమీద విరిసే గులాబీ అందం గులాబీలది! స్వచ్ఛందతకు మారుపేరులా ముగ్ధ సౌందర్యవతి అందంలా నిగనిగ మెరుస్తూ భగవంతుని పాదాలకి అంకితమయ్యే మందారాల అందం మందారాలది. సువాసనలు నలుమూలలా వెదజల్లుతూ ఇరువురి ప్రేమికులను ఒకటిగా కలిపే అందం అర్హతాగల పువ్వూ, కవుల కావ్యాలలో సముచిత స్థానాన్ని సంపాదించిన పువ్వు మల్లెపువ్వు! దాని అందం దానిదీ! అలాగే నందవర్ధనం, అలాగే గన్నేరు, అన్నీను!" అంది సంగీత.

పగలబడి నవ్వింది సాహితి!

"ఎందుకా నవ్వు?" బుంగమూతి పెట్టింది సంగీత!

"అలాగే ఈ అందాల పోటీలలో జడ్జీలుగా వుండే వారి కళ్లకి చామన

చాయగా వున్న రంగు ఇష్టమైతే అలాంటి రంగుగల పిల్లనీ, లావాటి పెదవుల పిల్లయితే అలా ఇష్టం వున్న జడ్జీ ఆమెనే అందమైనదిగా ఎంపిక చేస్తాడు! ఇందాక నువ్వు చెప్పిన విధంగా ఏ పువ్వు అందం ఆ పువ్వుదే! అలాగే ఒక వ్యక్తి అందాన్ని నిర్ణయించడం కూడా కష్టం. ఒకమ్మాయి మొహానికి చిన్నమూతి అందంగా వుండొచ్చు! మరో అమ్మాయి స్ట్రక్చర్ని బట్టి కొంచెం వెడల్పు మూతి అందంగా అనిపించొచ్చు! అలాగే కొందరికి గుండ్రం మొహం బాగున్నట్టుంటుంది. కొందరికి కోలమొహం! కొందరు జీడిలా నల్లగా వున్నా ఎంతో కళగా కనిపిస్తారు. వాళ్లముందు తెల్లటి తెలుపు అనుకున్న వాళ్లు కూడా వెలవెలబోతూ వుంటారు. కాబట్టి అందం అనేది వాళ్ల వాళ్ల అభిరుచిని అంటే చూసే వాళ్ల అభిరుచుల్ని బట్టి వుంటుంది. అంతేకదా?" అంది.

"కరెక్ట్ సాహితీ! చిన్న దానివైనా చక్కగా చెప్పావు. నీకున్నపాటి తెలివి ఈ పోటీలు నిర్వహించే వారికుంటే అసలు ఇటువంటి పోటీలు పెట్టరు, ప్రపంచంలోకల్లా 'అందాల తార' అంటూ బిరుదునివ్వరు" అంది సంగీత!

"అసలు అక్కా! పోటీలు నిర్వహించే వారినేకాదు పోటీలో పాల్గొనే వాళ్లనీ అనాలి! నీకు అందాల రాణిగా అందరిలోకి అందమైన దానిని ఎంపిక చేసి బహుమతిని ఇస్తున్నాం" అని అన్నప్పుడు మురిసిపోతూ ఆడపిల్లలు నిజమే తాను చాలా అందమైన పిల్ల అనుకుంటూ ఆ బహుమతిని అందుకోవడం ఎంత హాస్యాస్పదం!

"ఈ పోటీలన్నీ ఏవో వ్యాపారసంస్థలు నిర్వహిస్తూ వుంటాయి సాధారణంగా! ఈ పోటీలో నెగ్గిన వారిని వ్యాపార ప్రకటనల కోసం వాడుకుంటూ వుంటారు కూడా! అది వాళ్ల అవసరం! అంది సంగీత కూల్‌గా!

"అదేలే అక్కా! 'డిస్కౌంట్ సేల్' అని పెట్టే చోటు ఎంత డిస్కౌంట్ నిజంగా దొరుకుతుందో, దొరికినా ఎటువంటి సరకు దొరుకుతుందో తెలిసిన వాళ్లెవరూ ఆ డిస్కౌంట్ సేలు జోలికి పోరు! అలాగే అందాలపోటీల సంగతి తెలిసిన వాళ్లు కూడా ఆ జోలికి పోరు! అందుకని వాటి గురించి ఆలోచించడం అనవసరం!" అంది సాహితి! "అదేలే! బబితా శేషాద్రి మిస్ ఆంధ్రప్రదేశ్ అయితే మనం మిస్. ఇండియాలనొచ్చు!" నవ్వింది సంగీత!

*